20/5/90

95

# తియ్యని కన్నీళ్లు!

కుప్పిలి పద్మ

ఎర్రని కెరటం అంబరాన్ని తాకేవేళ డాబాపై కూర్చుని ఈ వసంతానికి మా పెరట్లో పూసిన తొలి మల్లెమొగ్గల మాలకడుతున్నాను. తెల్లగా బొద్దుగా అచ్చు నాసాగర్ కళ్లలా స్వచ్ఛంగావున్నాయి.

నాసాగర్?

నిజంగా నా సాగరేనా?

స్వచ్ఛంగా కళ్లున్నాయా?

మనసులో కల్మషం వుంటే నయనాలలో స్వచ్ఛత కన్పిస్తుందా?

కల్మషం!

ఏంటి కల్మషం?

అమ్మాయిని ప్రేమించడమా?

ఊహు. భార్యుండగా మరో అమ్మాయిని ప్రేమించడమా? క్రింద నుంచి మైనామాటలు వినిపిస్తున్నాయి. లచ్చమ్మా సంధ్యవుందా?

మైనానా స్నేహితురాలు. ఇద్దరం అంతర్వేదిలో పుట్టాం. పెరిగాం. వివాహం అయ్యాక ఒకే వూరిలో కాపురం పెట్టాం. మైనారాష్ట్ర ప్రభుత్వంలో ఉద్యోగం చేస్తుంది. భర్తకి అమ్మాయిల బలహీనతని బాధపడుతుండేది. ఇప్పుడెలా వుందో? చాలారోజుల కొచ్చింది.

"డాబాపై ఉన్నారమ్మా" అంటుంది లచ్చమ్మ.

మెట్లపై మైనా చెప్పుల చప్పుడు.

పలకరింపుగా నవ్వాను.

"కింద కూర్చున్నావేం. లంకంత కొంప వొదిలి, అంటూ ఎదురుగా వున్న వాలుకుర్చీలో కూర్చుంది.

నాగరిక జీవితం ఎన్ని సదుపాయాలని ఇచ్చినా ఇంట్లో నేలపై గుమ్మానికి ఆనుకుని బియ్యం ఏరటం, నూతిగట్టుపై కూర్చుని వొత్తులు చెయ్యడం, దక్షిణం గది సావిట్లో వాలు కుర్చీలో నడుంవాల్చి గీత చదువుకోవటం, డాబాపై కూర్చుని పూలు మాలకట్టడంలో పూర్వపు అనుభూతి. సొంత భావన. వింత సౌఖ్యం.

ఇదంతా నే వివరించలేను.

'ఇంత పెద్ద ఆఫీసరు భార్యవి ఇదేం చీర. ఏం సాగర్ నిన్ను సరిగ్గా చూడటం లేదా. అదిగో ఆవిషయం మాట్లాడదామనే వొచ్చాను అందామె.

రోజా ఆరొందలకి తక్కువకాని చీరలు కట్టుకోవచ్చు. కాని తెలిగ్గా వుండే నేతచీర పొరల మండి మేనుని స్పృజించే వేసవిగాలి గిలిగింత, ఆ పులకరింతని నే దూరం చేసుకోలేను.

"మీ వారెలా వున్నారు" అని అడిగాను.

"అలాగే రోజుకో అమ్మాయితో తిరుగుతున్నారు అంది.

"నువ్వెలా భరిస్తున్నావ్"

లచ్చమ్మ కూల్ డ్రింక్‌తో వచ్చింది.

గ్లాసు అందుకుంటూ "ఏమంటున్నాడు మీ రాములు" అడిగింది మైనా. ఆడిని ఒగ్గేసానమ్మా. ఇప్పుడున్నోడు ఏదయ్యా అంది లచ్చమ్మ. రాములు లచ్చమ్మ భర్త. బాగా తాగేవాడు. అతను తాగడం లచ్చమ్మకి అభ్యంతరంకాదు. ఆ మత్తులో చితకబాదేవాడు. లచ్చమ్మ దానికి అభ్యంతరం పెట్టింది. రాములువినలేదు. లచ్చమ్మ రాముల్ని వదిలేసింది. నచ్చిన మరోవ్యక్తిని పెళ్లి చేసుకుంది. ఇదంతా చాలా సాధారణంగా జరిగిపోయింది.

పరువు ప్రతిష్ఠా సంకెళ్ల వ్యర్థ చప్పుడూ లేదు.

బంధం అనుబంధపు కన్నీళ్ల గల గలాలేదు.

పువ్వు పూసేనట్టు తార మెరిసేనట్టు చాలా మామూలుగా జరిగిపోయింది.

లచ్చమ్మ కిందికి వెళ్లిపోయింది.

ఈయనకి అమ్మాయిల సంఖ్య చాలు. అటువంటి వాళ్లు బంధానికి, అనుబంధానికి చోటివ్వరు. తనెంత మందితో తిరిగినా నన్ను వదిలెయ్యరు. పిల్లలకి అన్యాయం చెయ్యరు అయినా ఆయన పబ్లిక్‌గా తిరగరుగా. ఆ లైఫ్‌కి ఏదో ఒక చోట కల్పుకుంటారు. ఇదంతా బయట ప్రపంచానికి తెలియదు.

అతని భార్యగా నాకొచ్చే గౌరవమర్యాదలని అందరూ ఇష్టువేవుంటారు. సాగర్ విషయంలో అతను ఆ అమ్మాయిని ఒక బంధంగానో అనుబంధంగానో తీసుకున్నాడు అని నేననుకుంటున్నాను. అతను చాలాసార్లు ఆమెతో కన్పిస్తున్నాడు. వాళ్లిద్దరూ చేతిలో చెయ్యి వేసుకుని తిరగడం చాలాసార్లు చూశాను. పోయినాదివారం మిసెస్‌ముఖర్జీ మా ఇంటికొచ్చింది. ఇదే విషయంచెప్పింది. నీ పరువేం కావాలి" అంది మైనా.

అప్పుడే పుదయిస్తున్న నిండు చంద్ర బింబాన్ని చూస్తూ నాన్న ఉత్తరం రాశారు. మీ తమ్ముడి పెళ్లికి నువ్వువెళ్లినప్పుడు తాంబ్రడ కావాలన్నావంటగా. ఎంత కావాలో రాయమన్నారు" అన్నాను మాట మారుస్తూ.

"నేను నీ జీవితం గురించి మాట్లాడుతుంటే నువ్వేంటి తాంబ్రడంటావ్. సాగర్ని నిలదీసి అడుగు. విషయం తేల్చుకో. భార్యగా ఆ హక్కు నీకుంది" అంది.

"అతను వినకపోతే"

"ఎందుకు వినడు. వింటారు. వీళ్ల ప్రతాపమంతా బయటే. భార్యల దగ్గర పిరికివాళ్లే. మీ నాన్నకి చెపుతానని చెప్పు అందామె.


విడాకులు ఇస్తానంటే:

"విడాకులా?" ఆశ్చర్యంగా అని ఆగి తిరిగి "వద్దు అటువంటి పని చెయ్యకు. పిల్లలు నలిగిపోతారు. సంఘంలో గౌరవం వుండదు. ఆర్థిక స్వేచ్ఛ అంటారు గాని అదివుండి కూడా చాలా మంది ఎందుకు బయటికి రావడంలేదంటే కేవలం గౌరవమర్యాదలుండవని. పిల్లల భవిష్యత్తు గురించి లచ్చమ్మలా మనం బ్రతకలేం కదా అంది మైన.

మీకు వెన్నెలపై మల్లెలు పరిస్తే
మల్లెలపై వెన్నెల కురుస్తుంది. తిరిగి
మల్లెలు జల్లితే? మళ్లీ వెన్నెల
కురుస్తుంది. ఎప్పటికి వెన్నెలని
మల్లెలు జల్లి దాచలేం. వెన్నెలని జయించలేం.

బాగాఆలోచించి సాగర్ని మందలించు. నే రెండు రోజుల తర్వాత వస్తాను అంది మైన.





మల్లెపూల మాల చేతుల్లోకి తీసుకుంటుంటే చేతిగాజులు సుతారంగా మ్రోగాయి.

సాగర్‌తో నా పెళ్లయిన తర్వాత వచ్చిన తొలి వసంత మాసంలో ఓ రోజు సాయంత్రం వంట చేస్తుంటే 'మల్లెపూలోయ్' అని వీధిలో పూలకుర్రాడి పిలుపువినిపించింది. వాకిట్లోకి వచ్చి ఆ కుర్రాడిని పిలవబోయి చప్పున ఆగిపోయాను.

ఈసంవత్సరం మల్లెపూలకి ఓ విశిష్టతుండాలి. సాగర్ చేతుల్తో ఇచ్చే పూలనే తొలిసారి పెట్టుకోవాలి.

ఆరోజు రాత్రి భోజనాలు అయ్యాక నాకుమల్లెపూలు కావాలి అన్నాను. ఆ ఎక్కడ దొరుకుతాయ్ అని అమాయకంగా అడుగుతున్న అతడికి చేరువుగా జరిగి జుట్టులోవేళ్లు జొనిపి ఇంత చిన్న చిన్నవిషయాలు తెలియవ్. అంత పెద్ద బిజినెస్ ఎలా చేస్తున్నారు అన్నాను.

సాగర్ నవ్వి తెల్చుకుని తెస్తాను అన్నాడు.

ఒకటి.. రెండు.. మూడు రోజులుగడిచిపోయాయి. అతను పూలు తీసుకురాలేదు.

మట్టివాసన..వర్షాకాలం వచ్చేసింది.

శ్రావణమాసం నోములకి అత్తయ్య బంగారు గాజులు ఇచ్చారు. సాగర్ మట్టిగాజులు తెస్తే ఊహు..

మట్టిగాజుల సంగీతం ముందు ప్రపంచంలో ఏ సంగీతం ఆహ్లాదంగా వుండదు అని అతనితో అన్పిస్తాను.

నా ఆలోచన నాకే నవ్వొచ్చింది.

మట్టిగాజులు– మల్లెపూలు.

లాభ నష్టాల సవ్వడిలో మట్టిగాజుల గల గల వినిపిస్తుందా? కాంపిటీషన్ కష్టమర్స్ వూపిరిలో మల్లెల సౌరభం వీస్తుందా? సాగర్‌ది పచ్చని ఛాయ. ముదురు రంగు షైప్ బాగుంటాయి. కొనుక్కురావాలి.

ఈ బ్లూకలర్ షర్టు ఎంత బాగుందో. సాగర్‌కి కొంటే? కొంటే ఏంటి? కొనడమే.

సాగర్‌కి ఫిష్ కట్‌లెట్ అంటే ఇష్టం. వెయ్యాలి.

సాగర్‌కి జలుబు చేసింది. ఆ డాక్టరేంటి జలుబుకి మందు లేదంటాడు. అయ్యో! సైంటిస్టులంతా ఏం చేస్తున్నారో. ఎలా అతనికి జలుబొచ్చింది. జలుబుకి మందు కనుక్కున్నవాళ్లకి నోబుల్ బహుమతినిప్పిస్తాను. నా మాట ఎవరు వింటారు? పోని నా డైమండ్ నెక్లెస్ ఇచ్చేస్తాను.

సాగర్. సాగర్.. నా ఆలోచన, నా ఊహ, నాకలా సాగర్.

సాగర్ ఈరోజు మరో అమ్మాయితో తిరుగుతున్నాడు అదీ చేతిలో చెయ్యివేసి.

రోజూ ఆవిషయం చెప్పడానికే ఎవరో ఒకరు ఇంటికి వస్తున్నారు.

ఫోన్లు చేస్తున్నారు. ఉత్తరాలురాస్తున్నారు.

భర్తని అసహ్యించుకుంటూనే లోకం కోసం అతని భార్యగా బ్రతికే మైనా, హింసించే భర్తతో బ్రతకలేక బయటికి వచ్చిన లచ్చమ్మ నా కళ్ల ముందు మెదిలారు.

వీళ్లిద్దరిలో ఎవరిది మంచి పద్ధతి.

ఎవరి దారి వారికే కరెక్టుగా తోస్తుంది. అది నిర్ణయించడానికి నేనెవర్ని?

ఇప్పుడు నేనేం చెయ్యాలి?

"సాగర్! ఎందకిలా చేశావ్" అని అడగలేను.

మూడుముళ్ల బంధంతో మనసుని నేనెలా శాసిస్తాను.

అసలీవార్త సత్యమా అసత్యమా తెల్చుకోవాలని లేదు.

అతని జీవితం నుండి తప్పుకోవాలా?

తప్పుకొని?

నాకు ఆర్థిక స్వేచ్ఛవుంది. పిల్లలు ఎవరిదగ్గరున్నా వాళ్ల భవిష్యత్తుకివచ్చే నష్టం ఏముంది. ఇవి కాదు నాసమస్య.

సమాజమా?

కాదు. ఇవేం కావు.

నా మనసు.

అతను మరొకర్ని ఇష్టపడుతున్నాడని తెల్సిన క్షణం గుండెల్లో గంగ ఘనీభవించింది. కాని అతనంటే అసహ్యం కలగలేదు. అతనికి జలుబు చేస్తేనే గిలగిలలాడిందే నాప్రాణం.

మరి అతన్ని ఈ విషయం గురించి కఠినంగా ఎలా ప్రశ్నించను. నొచ్చుకుంటే అమ్మో! నా గుండె సెగైనా సహిస్తా.. కాని అతడితో పౌరుషంగా మాట్లాడలేను.

మాట్లాడొద్దు. విడాకులిచ్చి. లచ్చమ్మలా మరో పెళ్లి చేసుకో. ఎవర్ని.

నిన్ను ప్రేమిస్తున్నానంటూ పెళ్లేమానుకున్న గిరి వున్నాడుగా. గిరి నాకు బావ అవుతాడు. అంతస్తు తగాదా వచ్చి పసితనంలోనే రెండుకుంటుంబాలు విడిపోయాయి. సాగర్‌తో నా వివాహం అయ్యాకొకసారి గిరి "నువ్వంటే నాకు ప్రాణం సంధ్యా. చెప్పే అవకాశంరాలేదు. అందుకే జీవితాంతం ఇలాగే వుండిపోదల్చుకున్నాను" అన్నాడు.

నాకేం అన్పించలేదు. నేనేం కదిలిపోలేదు. ఎప్పుడూ గుర్తూ రాలేదు. నన్ను ఇష్టపడేవాళ్లకంటే నేనిష్టపడే వాళ్లంటేనే నాకు ఆసక్తి.

నన్ను ప్రేమించే ప్రేమకంటే నే ప్రేమించే ప్రేమంటేనే నాకు ప్రేమ.

అందుకే లచ్చమ్మలా విడిపోలేను. మరొకర్ని ఆహ్వానించలేను. అతను నాకేదో చెయ్యాలనే స్థాయి నుండి అతనికి నేనేం చెయ్యగలననే స్థితిలో వున్నాను.

సమాజం, సంఘం– మైనా లచ్చమ్మ ఎవరైనా సరే పిరికితనమని హేళన చేసినా, అభివృద్ధి నిరోధకమని అరిచినా, అనాగరికమని వేదికలెక్కినా నేనెప్పటికీ సంధ్యా సాగర్నే. ఎందుకంటే వెన్నెల లోకాన్ని ఇష్టపడినట్టు, మల్లె వసంతాన్ని అభిమానించినట్టు, మంచు కార్తీకాన్ని ఆరాధించినట్టు నే సాగర్ని ప్రేమించాను.

అందుకే నే ఎప్పటికీ సంధ్యా సాగర్నే.

